BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU
మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ 17-02-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
ANN తెలుగు

కేసీఆర్‌కు సీఎం రేవంత్ బర్త్‌డే విషెస్

భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలంటూ ట్వీట్

మహా, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ట్విట్ చేశారు. "గజ్వేల్ నియోజకవర్గ శాసనసభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారి జన్మదినం సందర్భంగా వారికి హార్దిక శుభాకాంక్షలు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' అని ఆకాంక్షించారు.

శుభాకాంక్షల వెల్లువ

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 70ఏళ్లు పూర్తిచేసుకొని నేడు 71 వసంతంలోకి అడుగుట్టారు..కేసీఆర్ పుట్టినరోజు సదర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా.. ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. బీఆర్ఎస్ నేతలు, శ్రేణులు కూడా పెద్ద ఎత్తున కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహిస్తున్నారు.

ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలి – జగన్

వైఎస్సార్‌సీపీ అధినేత , ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ కూడా కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.. ఈ మేరకు ట్విట్ చేశారు. ప్రజా సేవలలో నిండు నూరేళ్లు ఉండాలని ఆయన ఆకాంక్షిచారు.. ఆ భగవంతుడు మీక సంపూర్ణ ఆరోగ్యం , ఆనందం ఇవ్వాలని అభిలషించారు.. మీరు అనుకున్న పనులు దిగ్విజయంగా పూర్తి చేయాలని కోరారు.

కేసీఆర్.. తెలంగాణ జాతికే హీరో

కొడుకుగా పుట్టడం పూర్వజన్మ సుకృతం: కేటీఆర్

మహా, హైదరాబాద్: 'కేసీఆర్ కేవలం తనకు మాత్రమే కాదు.. యావత్ తెలంగాణ జాతికే హీరో' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ కొడుకుగా పుట్టడం తన పూర్వజన్మ సుకృతమని చెప్పారు. ప్రతీ తండ్రీ.. తమ పిల్లలకు హీరో.. కానీ, నా తండ్రి నా ఒక్కడికే కాదు.. తెలంగాణకే హీరో కావడం నా అదృష్టం.. తెలంగాణ కోసం హద్దుల్లేని నిబద్ధతతో వచ్చారు.. పనిచేశారు .. తెలంగాణ అనే కలను ప్రేమించారు.. వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించకుండా సాధించారు అంటూ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ 71వ జన్మదినం సందర్భంగా సోమవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలిలో విపక్ష నేత మధుసూధనా చారి, ఎమ్మెల్యే హరీశ్ రావు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణను స్వప్నించి సాకారం చేసిన మహోన్నతుడు కేసీఆర్ అని చెప్పారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో అందరం కలిసి పనిచేద్దామన్నారు. కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

కువైట్‌లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

మహా, కువైట్: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు సోమవారం కువైట్‌లో ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ కువైట్ అధ్యక్షురాలు అభిలాష గొడిశాల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కువైట్‌లో మొక్కలు నాటి కేసీఆర్‌కు జన్మదిన శుకాంక్షలు తెలిపారు. అధ్యక్షురాలు అభిలాష మాట్లాడుతూ కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. నైజీరియా దేశస్థుడు ఛాస్ కూడా కేసీఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబాన్ సోహెల్, సురేష్ గౌడ్, ప్రమోద్ కుమార్, అయ్యప్ప, మహబూబ్, లవన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మళ్లీ డ్రగ్స్ కలకలం

- అలివ్ బిస్ట్రో పబ్‌పై పోలీసుల దాడులు..20 మందిలో ఒకరికి పాజిటివ్..

మహా, హైదరాబాద్: నగరంలో మరోసారి డ్రగ్స్ పార్టీ కలకలం సృష్టిస్తోంది. మాదాపూర్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లోని అలివ్ బిస్ట్రో పబ్‌లో డ్రగ్స్ వాడినట్లు దుమారం రేపుతోంది. పక్కా సమాచారం రావడంతో పోలీసులు సోదాలు చేసినట్లు తెలిసింది. తనిఖీల్లో భాగంగా 20 మందికి డ్రగ్ పరీక్షలు నిర్వహించగా ఒకరికి పాజిటివ్ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. కాగా, తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో మాదకద్రవ్యాల కట్టడికి కృషి చేస్తోంది. డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యంగా సీఎం రేవంత్ ప్రభుత్వం

పనిచేస్తోంది. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా డ్రగ్స్ పార్టీలు అక్కడక్కడ వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా డ్రగ్స్, అసాఫిక కార్యక్రమాలకు అడ్డగా రిసార్ట్స్, పబ్స్ మారాయని.. నిత్యం వాటిపై పోలీసుల నిఘా కొనసాగుతూనే ఉంది.

రాహుల్ గాంధీ మతం, అభిమతం కులగణనే..

దేశవ్యాప్తంగా చేపట్టాలన్నదే రాహుల్ ధ్యేయం

సంక్షేమ ఫలాలు, రిజర్వేషన్లు కల్పించాలన్నదే లక్ష్యం
విజన్ ఉన్న గొప్ప నాయకుడు
విద్వేషం.. విధ్వంసమే బీజేపీ విధానం
అందుకే కులగణను తప్పుదోవ పట్టిస్తుండ్రు
కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై సీతక్క ఫైర్

మహా, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ మతం, అభిమతం కుల గణనేనని మంత్రి సీతక్క అన్నారు. విద్వేషం, విధ్వంసమే బీజేపీ విధానమని, సరైన లక్ష్య సాధన లేదని, కేంద్ర ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం పట్టదని మంత్రి సీతక్క మండిపడ్డారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కేంద్రమంత్రి బండిసంజయ్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీపై బండి వ్యాఖ్యలను తప్పుబట్టారు. కులగణన అంశాన్ని పక్కదారి పట్టించేందుకు రాహుల్ గాంధీని బీజేపీ నేతలు టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ విజన్ ఉన్న నాయకుడని, దైనమిక్ లీడర్ అని తెలిపారు.



దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన సంక్షేమ ఫలాలు, రిజర్వేషన్లు కల్పించాలన్నదే రాహుల్ గాంధీ అభిమతమని స్పష్టం చేశారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్ది న్యాయం చేయాలని రాహుల్ గాంధీ కులగణన కోసం డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా బీసీ కులగణన కోసం పట్టుబడుతున్నారన్నారు.

బీసీలకు సమన్యాయం అందించేందుకు కాంగ్రెస్ పోరాటం

ప్రేమ, శాంతి, సమానత్వం కోసం రాహుల్ గాంధీ పనిచేస్తున్నారని తెలిపారు బీజేపీ విద్వేషం, విధ్వంసాలు కావాలో.. కాంగ్రెస్ శాంతి సమానత్వం అభివృద్ధి కావాలో ప్రజలు తేల్చుకోవాలని మంత్రి సూచించారు. కులగణన అంశాన్ని డైవర్ట్ చేయడం కోసమే రాహుల్ గాంధీ మతం పేరిట రచ్చ చేస్తున్నారన్నారు. 'పదేళ్లుగా దేశం కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం బీజేపీ చేసింది ఏమీ లేదు. విభజన రాజకీయాలతో పదవులు పొందటం బీజేపీ నేతల నైజం.. రాహుల్ గాంధీ పదవుల కోసం పాకులాడే మనిషి కాదు. త్యాగాల వారసత్వంతో సమాజ అభివృద్ధి కోసం, సమసమాజ లక్ష్యం కోసం రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని' సీతక్క అన్నారు. రాజ్యాంగ మీద ప్రమాణం చేసి కేంద్ర మంత్రి అయిన బండి సంజయ్ నిర్దేశ ప్రసంగాలు చేస్తూ రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారన్నారు. ప్రజలంతా బీజేపీ నైజాన్ని గ్రహించాలని సీతక్క పిలుపునిచ్చారు.

సీఎంగా ఐదేళ్లూ రేవంత్‌రెడ్డే

- రానున్న కేబినెట్‌లో బీసీలకు అవకాశం
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

మహా, హైదరాబాద్: రాష్ట్రంలో సీఎంగా ఐదేళ్లూ రేవంత్‌రెడ్డే ఉంటారని, ఇందులో ఇసుమంత కూడా అనుమానం అవసరం లేదని, త్వరలో జరిగే కేబినెట్ విస్తరణలో బీసీలకు అవకాశం ఉంటుందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. సోమవారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో బీసీ కూడా సీఎం అవుతారని, అధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయాలు సైతం బీసీ ల చుట్టే తిరుగుతాయని వివరించారు. కేంద్రమంత్రి బండిసంజయ్‌కు సవాల్ విసురుతున్నా... రేపు 42శాతం రిజర్వేషన్లను అసెంబ్లీ లో చట్టం చేసి ఆమోదం తెలిపి కేంద్రానికి పంపిస్తామన్నారు. 9th షెడ్యూల్ లో చేర్చి రిజర్వేషన్ అమలు చేయించి మీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని పీసీసీ చీఫ్ అన్నారు.

లింగా.. ఓ లింగా..

భక్త జనసంద్రంగా పెద్దగట్టు..
డిల్లెం.. బల్లెం చప్పళ్లతో మారుమోగుతున్న దురాజ్‌పల్లి

మహా, సూర్యాపేట: ఓ లింగా.. ఓ లింగా.. నామస్మరణతో సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి మారుమోగుతున్నది. డిల్లెం బల్లెం చప్పళ్లు, డోలు వాయిద్యాలు, కాళ్లకు గజ్జెలచప్పళ్లతో హోరెత్తిపోతున్నది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే, రాష్ట్రంలోనే అతిపెద్దజాతర.. పెద్దగట్టు లింగమంతులస్వామి జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. తొలి అంకమైన దేవర(అందనపు చౌడమ్మ) పెట్టెకు తొలుత సూర్యాపేట గ్రామీణ మండలం కేసారంలో యాదవ సంప్రదాయంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ పెట్టెను మేళతాళాలు, బేరీలు మోగిస్తూ అత్యంత భక్తిప్రపత్తులతో యాదవ భక్తులు. హక్కుదార్లు. పూజారులు ఊరేగింపుగా శోభాయాత్ర నిర్వహించి పెద్దగట్టుకు చేర్చారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడుల నుంచి పెద్దఎత్తున భక్తులు తమ మొక్కులు సమర్పించేందుకు భక్తజనం గట్టుకు చేరుకున్నారు. సోమవారం ఉదయం నుంచి లింగమంతుల స్వామికి బోనాలు సమర్పించడం, ముద్దెరపోలు, జాగిలాలు పోయడం వంటి క్రతువులు నిర్వహిస్తున్నారు. యాదవులు సంప్రదాయ దుస్తులు ధరించి భేరీల చప్పళ్లతో సందడి చేశారు. లారీలు, డీసీఎంలు, ట్రాక్టర్లలో పెద్ద సంఖ్యలో తరలిరావడంతో జాతర భక్త జనసంద్రమైంది. భక్తులు గజ్జెల లాగులు ధరించి, కత్తులు, కటర్లు, డప్పు వాయిద్యాలతో గుట్ట పైకి చేరుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు

జాతర సందర్భంగా ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్ సెలవులు ప్రకటించారు. అదేవిధంగా జాతీయ రహదారి 65పై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి వద్ద మళ్లించి నల్లగొండ వైపుగా మిర్యాలగూడ, హుజూర్ నగర్, కోదాడ మీదుగా విజయవాడకు మళ్లించనున్నారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను కోదాడ వద్ద దారిమళ్లించి హుజూర్ నగర్, నేరేడుచర్ల, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కట్‌పల్లి మీదుగా హైదరాబాద్‌కు పంపిస్తారు.